www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231




తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :22 | 08-03-2021 | పుటలు : 4




మార్చి 8

అంతర్జాతీయ మహిళా దినోత్సవ

శుభాకాంక్షలు !!


- నన్నయవాణి

## ఘనంగా నన్నయలో సైన్స్ డే వేడుకలు

**01.03.21** (మీడియాసెల్) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యాన నేషనల్ సైన్స్‌డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్ హాజరై విద్యార్థులు చేసిన సైన్స్ ప్రయోగాలను తిలకించారు. సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి సైన్స్ దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యూచర్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇనోవేషన్ – ఇంపెక్ట్స్ ఆన్ ఎడ్యుకేషన్, స్కిల్స్ అండ్ వర్క్” అనే అంశంపై దేశ వ్యాప్తంగా సైన్స్ దినోత్సవ వేడుకలు జరుగుతున్నా యని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి సమాజహితంగా ఉండాలని భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో రావాలని ఆకాంక్షించారు. సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన క్విజ్, పిపిటి/డాక్యుమెంటరీ, పోస్టర్ ప్రెజెంటేషన్, ఎలోక్యూషన్, వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు పతకాలను, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యాన అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, డీన్ అకడమిక్ అఫైర్స్, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ ఆచార్య వై.శ్రీనివాసరావు, డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, డీన్ ఎగ్జామినేషన్స్ డా.ఎ.మట్టారెడ్డి, డైరెక్టర్ ఐ.క్యూ.ఎ.సి డా.కె.వి.స్వామి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డా.ఎన్.ఉదయ్ భాస్కర్, ఎన్.ఎస్.ఎస్ కో.ఆర్డినేటర్ డా.బి.కెజియా రాణి సైన్స్ దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ అశోక్



మన సమాజంలో విద్యాధికులైన మహిళలపై ఎంతో బాధ్యత ఉంది. మన సంస్కృతి మహిళలకు వారసత్వంగా ఎన్నో మంచి గుణాలను, సున్నితమైన భావాలను ఇచ్చింది. మిగతా దేశాల వారు దీన్ని పోగొట్టుకున్నారు. గత రెండు దశాబ్దాలుగా విదేశాలకు ప్రతి సంవత్సరం వెళ్తున్నాను. అమెరికా మహిళలు భారతీయ మహిళ ముఖాలలోని ప్రశాంతతను, ఎంతో కళాత్మకంగా కట్టుకునే వారి చీరలను ఎంతో మెచ్చుకుంటూ అసూయతో చూడడం గమనించాను. ఈ భారతీయ మహిళలు ఎంత ప్రశాంతంగా,ఎంత నెమ్మదిగా ఉన్నారో చూడు!అంటూ తమలో తామే ఆశ్చర్యంతో వారు అనుకుంటారు. మన భారతీయ సంస్కృతి,ధ్యానంపై శ్రద్ధ ప్రతి భారతీయ మహిళలలోను కనిపిస్తుంది.

- స్వామి రంగనాథానంద.

## సమాజానికి పాజిటివ్ సైకాలజీ అవసరం

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**03.03.21** (మీడియాసెల్) పాజిటివ్ సైకాలజీ అనేది భారతీయ సంస్కృతి సంప్రదాయాలలో భాగమని నేటి సమాజానికి పాజిటివ్ సైకాలజీ అవసరం ఎంతో ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకుపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో బుధవారం 'పవర్ ఆఫ్ పాజిటీవ్ సైకాలజీ' నేషనల్ వర్క్ షాప్‌ను నిర్వహించారు. డిపార్టమెంట్ ఆఫ్ సైకాలజీ, స్పృహ సైకాలజీ అలుమ్ని అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ వర్క్‌షాప్‌కు సైకాలజీ విభాగ సహాయాచార్యులు డా.ఎన్.వి.వి.ఎస్.నారాయణ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ మొక్కా జగన్నాథరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పాజిటివ్ సైకాలజీ అనేది భారతీయల సంస్కృతిలో భాగమని, ఒత్తిళ్ళుతో కూడిన నేటి ఆధునిక సమాజానికి పాజిటివ్ సైకాలజీ అవసరం ఎంతో ఉందని అన్నారు. కోవిడ్ కారణంగా ప్రపంచమంతా కుదేలైపోయిన పరిస్థితుల నుండి మానసిక స్థయిర్యాన్ని పెంచుకొని సమాజహితమైన అభివృద్ధి కోసం అడుగులు వేయాలని తెలిపారు. పాజిటివ్ సైకాలజీ అనేది తల్లి నుండి నేర్చుకుంటారని, సృష్టిలో తల్లి తొలి సైకాలజిస్ట్ అని అభివర్ణించారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు విలువలను తల్లి నేర్పిస్తుందని అన్నారు. పాజిటివ్ సైకాలజిపై మరిన్ని పరిశోధనలు జరగాలని, సమాజ భవిష్యత్ కు మంచి పరిణామమని తెలిపారు. రీసోర్స్‌పర్సన్‌గా కోయంబత్తూర్ పి.ఎస్.జి కాలేజ్ సైకాలజీ విభాగాధిపతి డా.రూప సెల్వరాజ్ హాజరై పాజిటీవ్ సైకాలజీ పరిచయం, పాజిటీవ్ ఎమోషన్స్ పాత్ర, స్థితిస్థాపకత, సానుకూల దృక్పథాల అభివృద్ధి తదితర అంశాలను వివరించారు. సాయంత్రం ముగింపు సమావేశానికి రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్ హాజరై పాజిటివ్ సైకాలజీపై చక్కని జాతీయ కార్యశాలను నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. వర్క్‌షాప్‌కు హాజరైన 150 మంది అభ్యర్థులకు రిజిస్ట్రార్ సర్టిఫికెట్లను అందజేశారు. అతిథులను నిర్వాహకులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, కన్వీనర్ డా.ఎన్.వి.వి.ఎస్.నారాయణ, కోకన్వీనర్లు డా.పి.రాజశేఖర్, డా.సి.వి.ఎస్.మణిరమణ, సిహెచ్.ఎన్.కె.భవాని, స్పృహా అలుమ్ని అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.నాగేంద్రకిషోర్, తదితరులు పాల్గొన్నారు.



నేషనల్ వర్క్ షాప్ లో ప్రసంగిస్తున్న వీసీ జగన్నాథరావు

## ర్యాగింగ్‌కు పాల్పడవద్దు

### అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.లతా మాధురితో ఇంటర్వ్యూ

రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా పరిధిలో అడిషనల్ ఎస్పీ గా కె.లతా మాధురి లా అండ్ ఆర్డర్ అండ్ ట్రాఫిక్ లో కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ పై అవగాహన సదస్సుకు ఆమె హాజరయ్యారు. (వారితో ఎడిటర్ ముఖాముఖి)



**మేడమ్. నమస్సులు ! తమ విద్యాభ్యాస విషయాలు తెలియజేయండి.**

మా స్వగ్రామం గాజువాక, విశాఖపట్నం. నాన్న ఉద్యోగ బదిలీ కారణంగా ఉత్తర రాష్ట్రాలలో నవోదయ విద్యాలయంలో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశాను. ఎంఎస్సీ జూవాలజీ ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పూర్తి చేశాను.

**ఉద్యోగ జీవితం ఎప్పుడు ప్రారంభం అయింది.**

2010వ సంవత్సరంలో గ్రూప్–1 సర్వీస్ డిఎస్పీ గా ప్రారంభం అయింది. కర్నూల్, అదిలాబాద్(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్), వికారాబాద్ (తెలంగాణా) లలో డిఎస్పీ గా విధులు నిర్వహించాను.

పదోన్నతిపై అడిషనల్ ఎస్పీ గా సిఐడి వైజాగ్ రీజిన్ లో పనిచేసి 2018 ఆగష్టు నుండి అడిషనల్ ఎస్పీగా రాజమహేంద్రవరంలో విధులు నిర్వహిస్తున్నాను.

**యాంటీ ర్యాగింగ్ పై ఎటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**

కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ర్యాగింగ్ కు పాల్పడితే వచ్చే నష్టాలను వివరిస్తున్నాం. ర్యాగింగ్ తో పాటు ఇతర నేర అంశాలపై గ్రామాలలో డిఎస్పీ స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులకు, యువతకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాం.

**ర్యాగింగ్ కు శిక్షలు ఏలా ఉంటాయి.**

ర్యాగింగ్ కు పాల్పడితే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేస్తాము. విచారణ చేపట్టి ర్యాగింగ్ తీవ్రతను ఆధారంగా ఆరు నెలల నుండి పదేళ్ల వరకు చట్టంలో శిక్షలు ఉన్నాయి. ఒకసారి ఎఫ్.ఐ.ఆర్ నమోదు అయిందంటే విద్యార్థి జీవితం అంధకారం. కాబట్టి నేరాలకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం.

**ర్యాగింగ్ పై అర్బన్ జిల్లా ప్రత్యేక కార్యచరణ ఏమిటి**

ర్యాగింగ్ నియంత్రనకు రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది. విజిబుల్ పోలీసు, షీ టీమ్ లు ప్రత్యేక బృందాలుగా పర్యావేక్షిస్తుంటారు. ర్యాగింగ్ హెల్ప్ లైన్ నెంబర్ గా 9490760794 సర్వీసు 24×7 అందుబాటులో ఉంటుంది.

**నన్నయ విశ్వవిద్యాలయం పై తమ అభిప్రాయం**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఒక్క ర్యాగింగ్ కేసు కూడా నమోదు కాకపోవడం హర్షనీయం. కళాశాల క్యాంపస్ లు, హాస్టల్స్ ను వీసీ మరియు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని విన్నాను. విశ్వవిద్యాలయం క్యాంపస్ చక్కని ఆహ్లాదకరమైన వాతావరణం దీనిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆశిస్తున్నాను. మంచిదండి. రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా పోలీసు పరిధిలో మీరు అందిస్తున్న సేవలు మరిన్ని ఫలితాలను ఇవ్వాలని, యువత నేరలకు దూరంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాం. నన్నయవాణి తమకు కృతజ్ఞతల్ని అందిస్తుంది.

**నమస్కారం మేడమ్.**

**థ్యాంక్స్, మళ్ళీకాలుద్దాం.**

## సంపాదకీయం



### యత్రనార్యస్తు పూజ్యంతే....

ఎక్కడ మహిళలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు దయకలిగి ఉంటారని. ఆనాటికీ ఈనాటికీ ఇది సత్య వచనం. సానుకూల భావం. స్త్రీలకు గౌరవమివ్వటమే ప్రధానాంశం. మహిళా చైతన్యం, విజ్ఞానం సమాజానికి ఉపయోగపడాలనే ఆలోచన భవిష్యత్తరాలకు ఒక పిలుపు. స్త్రీ పురుషుని కంటే చేతనావర్తంలో మిన్న అని శాస్త్రం చెబుతోంది. ఇదే విషయాన్ని సమాజం తెలుసుకుంది కూడా. మహిళల చైతన్యం, మానసిక శక్తి సమాజానికి ఉపయోగపడాలి.

చేపట్టిన రచనా వస్తువు సామాజికమైనా, రాజకీయమైనా బంగ్లాదేశ్‌లో దాడులను ఖండిస్తూ ప్రాణాలకు తెగించి 'లజ్జ' నవల రాసిన తస్లీమా నస్రీన్‌ను అభినందించకుండా ఉండలేం. ముస్లిం బాలికల విద్యాహక్కుల కోసం తాలిబన్ల తుపాకీ గుండ్లు చేసిన గాయాలను లెక్కచేయని మలాలాను ప్రశంసించకుండా ఉండలేం. ఆమె బ్రాండ్ అంబాసిడర్. అమెరికా ప్రభుత్వం స్వేచ్ఛా పతకం ఇచ్చి 60 లక్షల రూపాయలు బహుమానం ఇచ్చి గౌరవించింది. ఆ ధనాన్ని పాకిస్తాన్లో బాలికల విద్య కోసం అంకితం చేసింది. అందరం తుపాకులపై కాకుండా అక్షరాలపై, పుస్తకాలపై సంపదల్ని వినియోగిద్దామని పిలుపునిచ్చింది. ప్రపంచం నోబెల్ బహుమతినిచ్చి మహిళను విశేషంగా గౌరవించింది. వట్టిమాటల వల్ల ముక్తి లేదని కార్యరంగంలోకి దూకి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టిన మహిళా మణులకు మనం ఏమిచ్చి రుణం తీర్చుకోగలం. తమ జీవితాలను మానవజాతికి, దేశ సౌభాగ్యానికి అంకితం చేసిన మహిమాన్విత మహిళలు చరిత్రలో ఎందరో ఉన్నారు.

పుట్టుకతో స్త్రీకున్న పూజ్యస్థానం, సంప్రదాయకంగా స్త్రీకున్న గౌరవ స్థానం పదిలంగా ఉండటానికి స్త్రీపురుషులిరువురూ క్రియాశీలక విధానాలను రూపొందించుకోవాలి. ఇంటికి దీపం ఇల్లాలనే విశ్వాసం, సంస్కృతి మనదేశంలో వేళ్లూనుకుని ఉంది. దానిని రక్షించుకోవాల్సిన బాధ్యత కూడా స్త్రీ పురుషులిరువురి మీదా ఉంది. సృష్టిలో ఏదీ ఏకాంతం కాదు. స్త్రీపురుషులిరువురూ సంఘజీవులే. దృక్కోణం వేరైనా బాధ్యత ఒకటే. స్త్రీ,పురుష ద్వేషాలు అభినందించతగినవి కావు. సంఘర్షణాత్మక జీవనం సత్ఫలితాలను దూరంచేస్తుంది. మహిళాభ్యున్నతి సభ్య సమాజ అభిలాషగా గౌరవింపబడాలి.


**క్యాలెండర్లోని ప్రతి రోజూ ప్రపంచ మహిళా దినోత్సవంగా భవిష్య నిర్మాణం జరగాలి.**

# సుధామూర్తి - మహాశ్వేత




సుధా మూర్తి నవల మహాశ్వేత సంస్కృతంలో బాణుని కాదంబరి ఆధారంగా రాయబడినట్టు తెలుస్తోంది. ప్రేమ అనేది బాహ్య సౌందర్యం మీద కాకుండా ఆంతరిక సౌందర్యం నుంచి జనించేదనే విషయాన్ని తీసుకొని రచించిన నవల.

నవల చదివిన వారికి తప్పకుండా ఒక ఆడపిల్ల మనసు అర్థం అవుతుంది. అనుపమకి పెళ్లయిన తర్వాత శరీరం మీద బొల్లి మచ్చలు వచ్చినప్పుడు




భర్త, అత్తగారు గురిచేసిన మానసిక క్షోభను ఎలా భరించిందో, పుట్టింటికి చేరిన ఆమె చుట్టుపక్కల వారి నుంచి అవమానాలను అధిగమించి మళ్ళీ తన జీవితాన్ని చక్కదిద్దుకునే తీరు, ఇతరులు ఆమె మానసిక సౌందర్యానికి ముగ్ధులైన స్థాయికి చేరుకున్న తీరు చదువుతుంటే పాఠకులు ముగ్ధులవుతారు. తన భర్త ఒక డాక్టర్ అయి ఉండి ఈ మచ్చలు విటమిన్ లోపం వల్ల ఏర్పడ్డాయని విషయం తెలిసి కూడా తనను వదిలినప్పుడు గుండె పగిలి పోయి బాధ, అవమానాలతో ఆత్మహత్య వైపు పరుగులు తీస్తున్న మనసును అధిగమించి మనోబలాన్ని పెంచుకున్న తీరు ఆశ్చర్యాన్ని, ఉత్తేజాన్ని కలుగజేస్తుంది. అనుపమ జీవన రంగస్థలంలో ఎంతో ప్రావీణ్యతను సంపాదించుకుని, అందలమెక్కిన తీరు బాగుంటుంది.

ఈ నవల ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు అద్దం పట్టింది. మహిళ మానసిక వేదన కథాంశంగా తీసుకొని తనను తాను ఉద్ధరించుకోవడం, ఎన్నో అవకాశాలు ఉంటాయనే ఒక మార్గం, పురుషాహంకారం వల్ల కానీ, మరే కారణం వల్ల గానీ కొత్త మార్గాన్ని ఎంచుకుని తన సామర్థ్యాలను గుర్తుంచుకుని తనను తాను సమాజానికి పనికివచ్చే వ్యక్తిగా మలచుకోవచ్చనే



సందేశం ఈ నవలలో అంతర్లీనంగా అడుగడుగునా మనకు కనిపిస్తుంది. భారతీయ మహిళ తన ఆచాం ˊవ్యవ హారాలను అనుసరిస్తూనే సామాజిక మార్పులను గుర్తించి, తనను తాను మలచుకొని ఎదగాలని రచయిత్రి నవ యువతకు దిశానిర్దేశం చేస్తున్నారు. జీవితంలో మార్పు ఎంత అవసరమో చెప్పిన విధానం ఎంతో బాగుంది. ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగడానికి ప్రతి మహిళా చదవాల్సిన పుస్తకం మహాశ్వేత. సుధామూర్తి రచనాశైలి తేలికైనది కూడా. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అందరికి శుభాకాంక్షలు!!

**- డాక్టర్ మణిరమణ CVS.**

## అక్నూ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్

### అంబేద్కర్, సత్యలింగం నాయకర్ విగ్రహాలకు విసి ఎం.జగన్నాథరావు ఘన నివాళులు




**06.03.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.జగన్నాథరావు క్యాంపస్ ఆవరణలోని అంబేద్కర్, స్థలదాత సత్యలింగం నాయకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈసందర్భంగా జరిగిన సభకు క్యాంపస్ ప్రత్యేకాధికారిణి డాక్టర్ ఎం.కమలకుమారి అధ్యక్షత వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో విసి జగన్నాథరావు మాట్లాడుతూ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో స్థాపించే బయోడైవర్సిటీ పార్కు గురించి, అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ గురించి, రాజమహేంద్రవరం మెయిన్ క్యాంపస్‌లో స్థాపించబోయే ఇంక్యులేషన్ సెంటర్ (సాఫ్ట్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో) వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలియజేశారు. తొలుత స్టూడెంట్ ఎఫైర్ డీన్ ఎన్.ఉదయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితం చాలా విలువైనదని అన్నారు. దాన్ని చెడు వ్యసనాల జోలికి పోకుండా, మంచి అలవాట్ల ద్వారా సద్వినియోగం చేసుకోవాల్సి ఉందని అన్నారు. మీడియా సమావేశంలో క్యాంపస్ ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఎం.కమల కుమారి, ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు ముఖ్య అతిథులుగా ఎంఎస్ఎన్ ఛారిటీస్ అధినేత మల్లాడి శివరామ్ నాయకర్, క్రిఫి సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ అధినేత కె.కృష్ణారెడ్డి, స్టూడెంట్ ఎఫైర్ డీన్ ఎన్.ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

## మంచి మాట



**విద్యావంతులై, పవిత్రతకు ప్రతిరూపాలైన మాతృమూర్తుల గృహసీమలు మాత్రమే చిరస్మరణీయులకు జన్మస్థానాలుగా వెలుగొందుతాయి.**

**- స్వామి వివేకానంద**




## ప్రతిభా వాణి

# దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

### ఒక చైతన్య శక్తి...





ఆమె గొప్ప సంస్థా నిర్మాత్రి. భారతదేశమంతా జేజేలు పలకాల్సిన మహిళామ తల్లి. సంఘ సంస్కార పరాయణురాలు. ఉత్తమ దేశభక్తురాలు. స్వాతంత్రోద్యమ యోధాగ్రణి శ్రీమతి దుర్గాబాయ్. 12 ఏళ్ల వయసులో గాంధీజీ కాకినాడ వచ్చినప్పుడు ఐదు వేల రూపాయలు ఆయనకు అందిస్తూనే దేవదాసీలు, ముస్లిం మహిళలతో పాఠశాలలో సభ నిర్వహించి గాంధీజీని తీసుకొని వచ్చి మాట్లాడించిన వీర బాలిక. కాకినాడలో గాంధీజీ ఉపన్యాసానికి తెలుగు అనువాదం చేసింది. 20 ఏళ్ల వయసు మద్రాసులో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం అరెస్టయిన వెంటనే ఉప్పు సత్యాగ్రహం నడిపిన ధీర వనిత. జాతీయోద్యమంలో మూడు సార్లు జైలుకి వెళ్ళింది. మధుర జైలులో నిర్మానుష్య కారాగారంలో శిక్ష అనుభవించింది. ఐదవ తరగతి వరకు పాఠశాల చదువు మాత్రమే చదివిన ఆమె ఎమ్.ఏ.,ఎల్.ఎల్.బి.వరకు చదివింది. రాజ్యాంగ నిర్మాణ శాసనసభ సభ్యురాలైంది. గడచిన తరంలోని దేశభక్తుల, మహానాయకుల ప్రశంసలను పొందింది. మద్రాసులో, హైదరాబాదులో ఆంధ్ర మహిళా సభ సంస్థలు ఆమె దీక్షా దక్షతల కీర్తిపతాక. 46 దేశాలలో నుంచి సాంఘిక సేవా పరాయణతకు ఎన్నికైన ధీమంతురాలు. అక్షరాస్యత వ్యాప్తికి ప్రపంచ స్థాయి యునెస్కో పురస్కారం పొందిన ఉజ్వల మహిళా మణి. ఆమె పట్టిందల్లా బంగారం. తలచిన తలపెల్లా సంస్థా నిర్మాణం. 1953లో చింతామణి ద్వారకనాథ్ దేశ్‌ముఖ్‌ను వివాహమాడింది దుర్గాబాయ్. జననం 1909 జూలై 15. ఆమెది సార్థక జీవనం. 1981 పరమపదం. భారతదేశంలో మహిళా చైతన్య శక్తికి ప్రతీక దుర్గాబాయ్. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భాన ఆమెకిదే నన్నయవాణి అక్షర నీరాజనం.

# మంచు కురిసే వేళలో...









యాగాటి కీర్తన
1st B.Tech, EIE

# ర్యాగింగ్‌కు పాల్పడొద్దు


### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



**04.03.21 (మీడియాసెల్)** జీరో పర్సెంట్ ర్యాంగింగ్‌తో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గుర్తింపును పొందిందని భవిష్యత్తులో నన్నయ విశ్వవిద్యాలయానికి ఉన్న ప్రత్యేకతను కాపాడే విధంగా విద్యార్థులు మంచి వాతావరణాన్ని నెలకొల్పాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో గురువారం "యాంటీ ర్యాగింగ్, మద్యపానం, మాదకద్రవ్య దుర్వినియోగం" పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో స్టూడెంట్ ఎఫైర్స్ డీన్ డా.ఎన్.ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, అడిషనల్ ఎస్పీ కె.లతామాధురి ఐ.పి.ఎస్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.సోమసుందరరావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.లక్ష్మీకాంత్, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్‌లు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరంలో విశ్వవిద్యాలయంలోని వివిధ కోర్సులలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు శుభాకాంక్షలను తెలియజేశారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు విద్యా, పరిశోధన వంటి అన్ని అంశాలలోనూ మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. కెరీర్ గైడెన్స్ ఇస్తూ సహోదరుల్లాగా సహకరించాలని అన్నారు. అందరూ ఒకే కుటుంబంగా విశ్వవిద్యాలయంలో ఉన్న మంచి వాతావరణాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలని తెలిపారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నేరవేర్చి కన్నవారికి, కన్నభూమికి మంచి పేరును తీసుకురావాలని సూచించారు. విశ్వ విద్యాలయంలో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని వెంటనే వాటిని పరిష్కరిస్తానని అన్నారు. అడిషనల్ ఎస్పి కె.లతామాధురి ఐ.పి.ఎస్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జీరో పర్సెంట్ ర్యాంగింగ్ విశ్వవిద్యాలయంగా ఉండడం హర్షనీయమని, విద్యార్థులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న వీసీని అభినందించారు. ర్యాంగింగ్‌కు పాల్పడితే చట్టంలో కఠినమైన శిక్షలున్నాయని వాటిని గుర్తించి స్నేహభావంతో మెలగాలని అన్నారు. ర్యాగింగ్ సంబంధిత ఫిర్యాదుల కొరకు 9490760794 నెంబర్‌ను సంప్రతించాలని తెలియజేశారు. ఎస్.లక్ష్మీకాంత్ మాట్లాడుతూ నేటి యువతరం డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మాదకద్రవ్యాలకు, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. డాక్టర్ జి.సోమసుందరరావు మాట్లాడుతూ కుటుంబాలను నాశనం చేస్తున్న మద్యపానం ఫ్యాషన్‌గా మారిపోతుందని ఇది మంచి పరిణామం కాదని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులు మద్యానికి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆరోగ్యకరంగా జీవిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం ర్యాగింగ్, మద్యపానం, మాదకద్రవ్యాలు ఉపయోగించడం వల్ల కలిగే దుష్పరిణాలమాలపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక అందరినీ ఆకర్షించింది. యూనివర్సిటీ యాంటీ ర్యాగింగ్ పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. నిర్వాహకులు అతిథులను సన్మానించి విశ్వవిద్యాలయ జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి పాల్గొన్నారు.







ఇరుకుల సాయిప్రీతి
2 Nd MSc applied maths
పూర్వ విద్యార్థి

మహిళలు నేర్వగరాని విద్య
కలదే... ముద్దార నేర్పింపగన్.
-- చిలకమర్తి




# జయహో ! మహిళా ! విజయహో !!



(తనెంత అనే రోజు నుంచీ తనకంటూ ఓ రోజును సంపాదించుకునేంత వరకూ.....)





ఎన్నో ఉద్యమాలు. మరెన్నో పోరాటాలు. దేశమేదైనా మహిళ తన హక్కుల కోసం గట్టి పోరాటం చేసింది. మార్చి 8ని మహిళా దినోత్సవంగా తనకోసం తానే అంకితం ఇచ్చుకుంది. 1910లో కోపెన్ హాగెన్‌లో జరిగిన సోషలిస్ట్ మీటింగుకు 17 దేశాల నుంచి 100కు పైగా మహిళా ప్రతినిధులు హాజరయ్యారు. మహిళా సమానత్వం, పని పరిస్థితుల మెరుగుదల, మహిళలకు ఓటు హక్కు లక్ష్యాలుగా ఏర్పాటైన ఆ సదస్సే ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన అవసరాన్ని గుర్తించింది. దీని స్ఫూర్తితోనే మరుసటి ఏడాది డెన్మార్క్, ఆస్ట్రేలియా, జర్మనీ, స్విజ్జర్లాండ్ దేశాలలో దాదాపు పది లక్షల మంది స్త్రీ, పురుషులు మహిళల కోసం ర్యాలీలు నిర్వహించారు. 1914 నుంచే అనసూయ సారాభాయ్ నేతృత్వంలో మహిళా కార్మికుల హక్కుల కోసం భారతదేశంలోనూ ఉద్యమాలు ఊపందుకున్నాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా 20 లక్షల మంది సైనికులను కోల్పోయిన నేపథ్యంలో దేశ మహిళలు ఉద్యమం బాట పట్టారు. 1917 సంవత్సరంలో 'బ్రెడ్ అండ్ పీస్' పేరిట ఆహారం, శాంతి అంటూ నినదించారు. నాలుగు రోజులపాటు సమ్మెను నిర్వహించారు. చివరికి ప్రభుత్వం దిగి వచ్చింది. వాళ్ల డిమాండ్లను పరిష్కరించడంతో పాటు, స్త్రీలకు ఓటు హక్కు ఇస్తున్నట్టు ప్రకటించింది. సమ్మె మొదలుపెట్టిన రోజు మనం అనుసరిస్తున్న గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం మార్చి 8. ఆ తర్వాత దశాబ్దాల తరబడి ప్రపంచవ్యాప్తంగా మహిళా సాధికారత కోసం ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయి. వాటి ప్రభావంతో ఐక్యరాజ్యసమితి 1975ను అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా అభివర్ణించింది. ఆ రోజు నుంచే మహిళా విజయానికి మైలురాయిగా నిలిచిన మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది.












# ఘనంగా సైకాలజీ ఫ్రెషర్స్ డే









## సివిల్స్ లో ఆప్షనల్ గా సైకాలజీ



సివిల్స్ కి ప్రిపేర్ అవుతున్నాను దానిలో ఆప్షనల్ సబ్జెక్టుగా సైకాలజీ ఉంది. పైగా సైకాలజీ సబ్జెక్ట్ అంటే నాకు మక్కువ ఎక్కువ. గీతం యూనివర్సిటీ ఎలక్ట్రికల్ లో డిగ్రీ పూర్తి చేసి నన్నయ వర్సిటీలో ఎం.ఏ సైకాలజీలో చేరాను. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాను. సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతూ క్లాస్ రూమ్ తో పాటు లైబ్రరీలని ఎక్కువగా ఇష్టపడుతున్నాను. నా లక్ష్య సాధనకు క్యాంపస్ ఎంతో ఉపయోగపడుతుంది.

– **అక్షయ్**



## హైదరాబాద్ నుండి వచ్చాను



సైకాలజీ కోర్సుపై ఆసక్తితో హైదరాబాదు నుండి వచ్చి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం లో ఎం.ఏ సైకాలజీలో ప్రవేశం పొందాను. నన్నయ సెట్ లో అర్హత సాధించి క్యాంపస్ లో సీటు రావడం చాలా ఆనందంగా ఉంది. మంచి సైకాలజిస్ట్ గా, కౌన్సిలర్ గా స్థిర పడాలన్నా లక్ష్యసాధనకు కుటుంబ సభ్యులు సహకరించారు. విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు సీనియర్, విద్యార్థులు ఎంతో తోడ్పాటు అందిస్తున్నారు. దూరప్రాంతం నుండి వచ్చి చదువుతున్నాననే భయం, బెంగా లేకుండా క్యాంపస్ వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా అనిపిస్తుంది.

– **పి.ప్రియాంక**

## బి.ఏ సైకాలజీ చేసి ఎం.ఏ చేద్దామని వచ్చాను



ఏలూరు సెయింట్ థెరిస్సా కళాశాలలో బిఏ సైకాలజీ పూర్తి చేసి ఎం.ఏ సైకాలజీ చేయాలని ఆసక్తితో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం లో ప్రవేశం పొందాను. క్రిమినల్ సైకాలజిస్ట్ గా స్థిరపడాలనే లక్ష్యంతో చిన్నతనం నుండి సైకాలజీలో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాను. కౌన్సిలింగ్ తో క్రిమినల్స్ లో మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తాను. క్యాంపస్ లో ల్యాబ్ లు, ప్రాక్టికల్స్ పాఠ్యాంశాలు ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి. **ఎస్ మాధురి**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in